

చెరువుల సంరక్షణకు చర్యలు

చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ, నీటిపారుదల సలహా మండళ్ల సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు జేసీ మౌర్య హామీ ఇచ్చారు.

8లో▸



టమాట రైతుకు భరోసా

టమాట రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కిలో ధర రూ.7 కంటే తక్కువకు పడిపోయినప్పుడు మార్కెటింగ్ శాఖ అధికారులు రంగంలోకి దిగి కొనుగోలు చేస్తున్నారు.

8లో▸

స్వర్ణ తేజం



మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం మూల బృందావనానికి శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు కవచాలతో అలంకరించి భక్తుల దర్శనానికి అనుమతించారు.

న్యూస్‌రీల్

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు గడువు పెంపు

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు పెంచినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మహమ్మద్ బేగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 3న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులకు 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలని తెలిపారు. ధ్రువపత్రాలతో ఈ నెల 28 లోపల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు www.bse.ap.gov.inలో సంప్రదించాలన్నారు.

శ్రీశైలం నుంచి 5,759 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి 5,759 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. శుక్రవారం నుంచి శనివారం వరకు బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 2,417 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,510, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీరు విడుదలైంది. గత కొద్ది రోజుల నుంచి జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జలాశయంలో 93.1430 టీఎంసీల నీరు నిల్వగా ఉండగా.. డ్యాం నీటి మట్టం 855.50 అడుగులకు చేరుకుంది.

మద్దిలేటి స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి భాద్రపద మాసం శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవలు నిర్వహించుకోవడంతో దేవస్థానానికి రూ.3,60,185 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు



జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్

చాగలమర్రి: వైఎస్సార్‌సీపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని జేసీఎస్ నంద్యాల జిల్లా కో–ఆర్డినేటర్‌గా ఎంపికైన షేక్.బాబులాల్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ కోసం కొన్నేళ్లుగా పనిచేస్తున్న తనను సీఎం వైఎస్ మోహన్‌రెడ్డి గుర్తించి 2019లో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రకటించిన జిల్లా కో–ఆర్డినేటర్ పదవులలో తనకు చోటు కల్పించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ సాగునీటి శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి కృతజతలు తెలిపారు.

పర్యావరణ గణపతికి ప్రణమిల్లి



చిట్టి చేతులతో ఏకదంతుడికి రూపమిస్తూ..

శుక్లాం బరధరం..అంటూ విద్యార్థులు మట్టి వినాయకుల తయారీలో ఉత్సాహం చూపారు. తమ చిట్టి చేతులతో లంబోదరుడికి రూపమిచ్చారు. సహజ రంగులతో ఏక దంతున్ని అలంకరించారు. చిట్టి గణపయ్యలను చూసి మురిసి పోయారు. సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం నంద్యాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ప్రకృతి హితంగా సాగిన ఈ కార్యక్రమంలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజిస్తామని విద్యార్థులు ప్రతినబూనారు.

వినాయకుడికి భక్తితో.. ప్రకృతికి ప్రేమతో..

- సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై విద్యార్థులకు శిక్షణ
- నగరంలో వివిధ పాఠశాలల నుంచి 150 మంది చిన్నారుల హాజరు
- పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు
- ఉత్తమ వినాయక విగ్రహాలను తయారీ చేసిన 10 మందికి బహుమతుల ప్రదానం



విద్యార్థి తయారు చేసిన మట్టి గణపతి



మట్టి వినాయక విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

వినాయక విగ్రహాల తయారీ, నిమజ్జనంలో పాటించాల్సిన నియమాలు...

- ➤ వినాయక విగ్రహాల తయారీలో సహజమైన రంగులనే వాడాలి. ఆయిల్ పెయింట్లు, రసాయనిక రంగులు వాడకూడదు.
- ➤ గణనాథుల అలంకరణ, పూజలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, థర్మకోలును వినియోగించరాదు.
- ➤ గణేష్ నిమజ్జనానికి ముందు పూలతో పాటు పూజకు వినియోగించిన అన్ని రకాల వస్తువులను కంపోస్టు ఎరువుగా తయారు చేసి మొక్కలకు వాడాలి.
- ➤ విగ్రహాలను ఎవరి ఇళ్లలో వారు ఒక బకెట్ నీటిలో పూర్తిగా కరిగిపోయే వరకు నిమజ్జనం చేసి, తరువాత ఆ నీటిని మొక్కలకు వినియోగించాలి.
- ➤ జలాశయంలో మట్టి విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేయాలి.
- ➤ గణేష్ నిమజ్జనానికి ముందు ప్లాస్టిక్, కరగని ఆభరణాలను తొలగించాలి.
- ➤ ప్రకృతిహితంగా వినాయకుడిని పూజిద్దాం ....పర్యావరణాన్ని కాపాడుదాం అన్న నినాదంతో ముందుకు కదలాలి.

నంద్యాల: సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల తయారీపై పాఠశాలల విద్యార్థులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని గురురాజా పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. సాక్షి టీవీలో మట్టి విగ్రహాన్ని తయారు చేసే విధానంపై ఇచ్చిన శిక్షణను అవగాహన చేసుకొని తమ చిట్టి చేతులతో గణనాథులను తీర్చిదిద్దారు. విగ్రహాల తయారీ కోసం మట్టి, సాధారణ రంగులైన కుంకుమ, పసుపు, స్థానికంగా లభించిన పూలను మాత్రమే వినియోగించారు. ఎలాంటి రసాయానిక రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను వాడలేదు. తామే స్వయంగా తయారు చేసిన వినాయకుల ప్రతిరూపాలను చూసి విద్యార్థులు మురిసిపోయారు. సోమవారం జరిగే వినాయక చవితి పూజ కోసం తమ ఇళ్లలోనే తాము తయారు చేసిన వినాయకులనే పూజిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని కల్పించిన సాక్షి మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.



బహుమతులకు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ మహబూబ్‌బేగ్, గురురాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత దస్తగిరిరెడ్డి తదితరులు

విజేతలు వీరే..

మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే కార్యక్రమానికి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆకట్టుకునే విధంగా సృజనాత్మకంగా తయారు చేసిన విద్యార్థులను పది మందిని నిర్వాహకులు ఎంపిక చేశారు. వీరిలో మొదటి బహుమతి సి.రిషి (8వ తరగతి), రెండవ బహుమతి రవితేజ (8వతరగతి), కె.సందీప్ (6వ తరగతి) విద్యార్థులను ఎంపిక చేశారు. వీరితో పాటు మరో ఏడుగురు అల్లబకాష్, ధనూష్‌కుమార్, గీతామాధురి, శ్రీధర్‌రెడ్డి, వీర యోగేంద్ర, హేమ, శ్రావణిలకు కన్సోలేషన్ బహుమతులు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ మహబూబ్‌బేగ్, గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, డాక్టర్ అనూషలు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ పి.హరినాథరెడ్డి, ఆర్సీ ఇన్‌చార్జ్ బాలమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బహుమతి రావడం ఆనందంగా ఉంది



సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం ఉందని చెప్పడంతో నేను ఇంట్లో రెండు రోజుల ముందుగానే మా అమ్మనాన్నల సహకారంతో విగ్రహల తయారీపై మెలకువలు తెలుసుకున్నా. పాఠశాలలో ఇచ్చిన శిక్షణ కూడా ఎంతో ఉపయోగపడింది. నేను తయారీ చేసిన ప్రతిమకు మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది. – రవితేజ, 8వ తరగతి

మట్టి విగ్రహాలు మేలు



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగించి తయారు చేసే విగ్రహాలు, అలంకరణ కోసం ఉపయోగించే రంగులల్లో మెర్క్యూరీ, లెడ్ అధికంగా ఉంటుంది. ఇవి నీటిలో కలసి తీవ్ర కాలుష్యాన్ని కలిగిస్తాయి. కలర్‌ఫుల్ గణేష్‌కు బదులు మట్టి గణపతిని ప్రతిష్టించి పూజించడంతో ప్రకృతికి ఎంతో మేలు చేసిన వారమవుతాం. సాక్షి మీడియా మట్టి వినాయక విగ్రహాలపై శిక్షణ కల్పించడం హర్షించదగ్గ విషయం.

– డాక్టర్ అనూష, గైనకాలజిస్ట్, నంద్యాల

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ డీఈఓ మహబూబ్‌బేగ్, గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరెడ్డి పేర్కొన్నారు. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఆకట్టుకునేలా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసి రంగులు వేస్తే కాలుష్యాన్ని ప్రోత్సహించిన వారమవుతామన్నారు. మట్టి విగ్రహాలు ప్రకృతికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నారులు ఎంతో ప్రతిభతో సృజనాత్మకంగా మట్టి వినాయక విగ్రహాలు తీర్చిదిద్దడం అద్భుతమన్నారు. సాక్షి మీడియా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ చిన్నారులకు శిక్షణ ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే సీఎం ధ్యేయం



చెక్కును విడుదల చేస్తున్న మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

- జిల్లాలో 5,573 మంది అక్క చెల్లెమ్మలకు కాపు నేస్తం
- ఖాతాల్లో రూ.8.36 కోట్లు జమ
- మైనార్టీ శాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా

నంద్యాల: మహిళల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ శాఖ ప్రభుత్వ సలహాదారు డీఎస్ హబీబుల్లా పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా వరుసగా నాలుగో ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన 3,57,844 మందికి రూ.536.77 కోట్ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుంచి బటన్ నొక్కి జమ చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లైవ్ ద్వారా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, మైనారిటీ శాఖ సలహాదారు హబీబుల్లా తదితరులు వీక్షించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హబీబుల్లా మాట్లాడుతూ కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల నిరుపేద అక్క చెల్లెమ్మలకు మెరుగైన ఆర్థిక పరిస్థితి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాల్గో విడత ఆర్థిక సహాయం కింద జిల్లాలో 5,573 మంది మహిళలకు రూ.8.36 కోట్ల వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. మేనిఫెస్టోలో చెప్పకపోయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు సామాజిక వర్గాలకు మరింత మంచి జరగాలన్న తాపత్రయంతో వరుసగా వైఎస్సార్ కాపు నేస్తం నిధులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాపులకు ఏమి చేసింది లేదన్నారు. కాపులను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల కోసం వాడుకొని వదిలేశారన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 5,573 మంది కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన మహిళలకు రూ.8.36 కోట్ల వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 1,327 మంది లబ్ధిదారులకు 1.99 కోట్లు, బనగానపల్లిలో 955 మందికి 1.43 కోట్లు, డోన్‌లో 1,075 మందికి 1.61 కోట్లు, నందికొట్కూరులో 295 మందికి 0.44 కోట్లు, నంద్యాలలో 960 మందికి 1.44 కోట్లు, పాణ్యంలో 287 మందికి 0.43 కోట్లు, శ్రీశైలంలో 674 మందికి 1.01 కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సీఎం జమ చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, బీసీ సంక్షేమ అధికారి జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



హెలిపాడ్ నిర్మాణంపై జేసీ రాహుల్‌కుమార్‌తో చర్చిస్తున్న మంత్రి బుగ్గన

డోన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. ఈనెల 19న కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద హంద్రీనీవా కాలువపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్‌తో 77 చెరువులకు సాగు నీరు మళ్లింపు కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం డోన్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఈ మేరకు సభా వేదిక, హెలిపాడ్ పనులను శనివారం సాయంత్రం మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ మనోహర్ ఉన్నారు. డోన్ సభ ప్రాంగణానికి హెలిపాడ్ నుంచి వచ్చే మార్గాన్ని మరింత వెడల్పు చేయాలని, వర్షం పడినా ఎలాంటి ఆటంకం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. సభా స్థలికి జనం వచ్చేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్‌ను దూరంగా ఏర్పాటు చేయాలన్నారు.

డిసెంబర్ నాటికి వాటర్‌గ్రిడ్ పనుల పూర్తి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్

డోన్: జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా డోన్ నియోజకవర్గంలో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో డోన్ మండల ఏఈ సతీష్‌తో కలిసి శనివారం ఆయన మాట్లాడుతూ.. డోన్ నియోజకవర్గంలో 75 గ్రామాల కు తాగునీరు అందించేందుకు రూ.297 కోట్లతో వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టామన్నారు. పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి 0.6 టీఎంసీల నీటిని డోన్ నియోజకవర్గ ప్రజల తాగునీటి కోసం ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మొదటి విడతగా వచ్చే నెలాఖరుకు నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి మంచినీరు అందిస్తామన్నారు. మిగిలిన డోన్, ప్యాపిలి మండలాల్లోని గ్రామాలకు డిసెంబర్ నాటికి తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 41 కిలోమీటర్ల పొడవున మంచినీటి పైపులైన్ నిర్మించామన్నారు. 72 గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు పూర్తయినట్లు వివరించారు. ప్రధాన పైపులైన్ నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఇన్‌టెక్‌వెల్, బుగ్గానిపల్లె వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం కూడా పూర్తయిందన్నారు. వీటన్నింటికీ మోటార్ల అమరిక కూడా పూర్తిచేశామన్నారు.

చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

- జిల్లా వ్యవసాయ, నీటిపారుదల సలహా మండలి సంయుక్త సమావేశంలో జేసీ నారపురెడ్డి మౌర్య



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య, చిత్రంలో ఎమ్మెల్యేలు కాటసాని, సుధాకర్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులకు జేసీ నారపురెడ్డి మౌర్య హామీ ఇచ్చారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమన్వయ కమిటీని వేసి ఆక్రమణకు గురైన చెరువులపై విచారణ జరిపిస్తామని చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, నీటిపారుదల సలహా మండళ్ల సంయుక్త సమావేశాలను జేసీ నారపురెడ్డి మౌర్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పాణ్యం, ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, డాక్టర్ జే.సుధాకర్‌రెడ్డితోపాటు వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సీహెచ్ శిరోమణిమద్దయ్య, మార్కెట్ యార్డుచైర్మన్ ప్రభాకరరెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లేవనెత్తిన చెరువుల ఆక్రమణపై జేసీ స్పందించారు. వచ్చే వారంలోపు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సమావేశమై ఎక్కడైనా చెరువులు, కాలువలను ఆక్రమించి పట్టాలు పొంది ఉంటే రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. జిల్లాలో కొర్ర, జొన్న, రాగుల సాగును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పౌరసరఫరాల దుకాణాల నుంచి వినియోగదారులు రాగులు పొందేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై డీఎస్ఓ, ఏఎస్ఓలను ఆదేశించారు.

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ..తాండ్రపాడు చెరువు ఆక్రమణకు గురవుతోందని మూడేళ్ల నుంచి పత్రికల్లో వార్తలు వస్తున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించడంలేదని, చెరువులో కట్టలు కట్టడం, చెట్లు పెంచుతున్నా కూడా ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. 20 ఏళ్ల నుంచి ఏ స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయో పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. అవన్నీ వదిలేసి అధికారులు మిన్నకుండిపోవడం అన్యాయమన్నారు. కేసీ కెనాల్ కింద రైతులు ఇప్పటికే పంటలు వేసినందున కనీసం ఒక తడి నీటిని అయినా అందించాలన్నారు. తుంగభద్రలో 93 టీఎంసీల నీరు ఉందని, అందులో ఏపీ వాటాను 4.5 టీఎంసీలను రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటకలో నీటి చౌర్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తుంగభద్ర బోర్డును కోరాలన్నారు. జిల్లాలో కావేరి పత్తి విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు ఇస్తారని వ్యవసాయధికారిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కల్లూరులోని పశువుల ఆసుపత్రికి మరమ్మతులు చేయించాలని కోరారు.
- కోడుమూరు శాసనసభ్యులు డాక్టర్ జే.సుధాకర్ మాట్లాడుతూ..గార్గేయపురం, గంగమ్మ చెరువుల విస్తీర్ణాలను తెలపాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. అలాగే వెంకాయపల్లె వెనుక భాగా నందనపల్లెకు వెళ్లే ఇరిగేషన్ కాలువ కూడా ఆక్రమణకు గురైందన్నారు. తన నియోజకవర్గంలోని రేమట, పులకుర్తి, మునగాల గ్రామాల రైతులు పంటలు వేశారని, ఒక్క పంటకైనా నీటిని విడుదల చేయించాలని అధికారులను కోరారు. కొత్తపల్లి రిజర్వాయర్ నుంచి కోడుమూరు నియోజకవర్గంలోని కొన్ని చెరువులకు నీటిని నింపే కార్యక్రమం చేపట్టాలని కోరారు. గతేడాది రైతులు వేసిన పంటలకు సంబంధించి గూడూరు మండలానికి సంబంధించి పత్తికి ఇన్సూరెన్స్ రాలేదని, పక్కనే ఉన్న పర్లకు మంజూరైందన్నారు. గూడూరు మండలంలోని నాగులాపురం, పెంచికలపాడు గ్రామాలకు మళ్లీ రాలేదన్నారు. పక్క పక్కనే ఉన్న గ్రామాలకు ఎలా వర్తించలేదని జిల్లా వ్యవసాయాధికారిని ప్రశ్నించారు.
- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ..తుంగభద్రప్రాజెక్టు కింద మిరప పంట వేశారని, ఫిబ్రవరి వరకు నీళ్లు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని చెన్నాపురం వరకు సరిపడా నీరు రావడంలేదన్నారు. అందుకు ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ చెన్నాపురానికి 250క్యూసెక్కుల నీళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పందికోన రిజర్వాయర్ కింద ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పిల్ల కాలువలను తవ్వలేదని, ఇంకెన్నాళ్లు సమయం కావాలని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు.
- వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ..కళ్లెదుటే చెరువులను ఆక్రమిస్తున్నా ఏమి చేస్తున్నారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. గంగమ్మ చెరువులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ప్రస్తుతం గార్గేయపురం చెరువుపై ఆక్రమణదారుల కన్ను పడిందన్నారు. ఎస్ఎల్ఎం కింద రైతులకు అర్బన్ ప్రాపర్టీస్ మార్టుగేజ్ చేయాలంటున్నారని, బ్యాంకర్లతో మాట్లాడి రూరల్ ప్రాపర్టీస్‌కు మార్టుగేజ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.
- ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి జిల్లాలకు సంబంధించి జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మల్యాల, ముచ్చుమర్రిలలో ఉన్న నీటిని కేసీ కెనాల్‌కు తీసుకునేలా తీర్మానం చేశారన్నారు. కేసీ కెనాల్ కింద ఇప్పటికే 80 వే ఎకరాలకు మొదటి తడి, రెండో తడికి నీటిని అందించామని, కేసీ కెనాల్‌కు శ్రీశైలం బ్యాక్ వాటర్‌ని కూడా తీసుకుంటున్నామని చెప్పారు. శ్రీశైలంలో ప్రస్తుతం 93 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఉన్న నీటితో ఆరుతడి పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. టీబీ డ్యామ్ ద్వారా వచ్చే నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రస్తుతం ఆదోని నుంచి కోడుమూరు వరకు నీరు ప్రవహిస్తోందన్నారు. టీబీ డ్యామ్‌లో 66 టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉన్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గణపతి నవరాత్రోత్సవాలు



సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వినాయక చవితి పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు గణపతి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. ఈ ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో రత్నగర్భ గణపతికి, శ్రీశైలం సమీపంలోని సాక్షి గణపతి స్వామికి, యాగశాలలోని పంచలోహ మూర్తికి ప్రతి నిత్యం వ్రతకల్పం విశేషార్చనలు నిర్వహించనున్నారు. ఆదే విధంగా సాక్షిగణపతి వద్ద మృత్తికా గణపతి (మట్టి గణపతి) విగ్రహాన్ని నెలకొల్పి ప్రతి రోజూ వ్రత కల్ప పూర్వకంగా పూజాదికాలను నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగానే తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ వ్రతకల్పపూర్వకంగా గణపతి పూజ, మండపారాధన, కళశార్చన, ఉపనిషత్ పారాయణలు, జపానుష్టాలు, గణపతిహోమం, రుద్రహోమం చేపడుతారు. ఉత్సవాల్లో చివరి రోజు 27 పూర్ణాహుతి అనంతరం సాక్షిగణతి వద్ద నెలకొల్పిన మృత్తికా గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు.

ఆర్జిత పరోక్ష సేవగా గణపతిపూజ

భక్తుల సౌకర్యార్థమై దేవస్థానం పరోక్ష ఆర్జిత సేవగా మృత్తికా గణపతిస్వామికి పరోక్ష సేవగా గణపతి పూజ నిర్వహిస్తుంది. కాగా ఈ పరోక్ష సేవకు రూ.1,116 రుసుముగా నిర్ణయించారు. భక్తులు సేవా రుసుమును www.srisailadevastanam.org లేదా aptemples.ap.gov.in ద్వారా చెల్లించి పరోక్ష గణపతి పూజ నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది.

18న ఉచిత సామూహిక సేవలు

ధర్మప్రచారంలో భాగంగా దేవస్థానం సోమవారం వినాయకచవితిని పురస్కరించుకుని ఉచిత సామూహిక సేవలలో భాగంగా గణపతి పూజ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెల్లరేషన్ కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒక రోజు ఉచిత సామూహిక సేవలు జరిపించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. సామూహిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన దలచిన భక్తులు www.srisailadevastanam.orgలో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

కేసీకి నీటి విడుదల



మల్యాల హంద్రీనీవా నుంచి కేసీకి విడుదలవుతున్న నీరు

నందికొట్కూరు రూరల్: హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. శనివారం మండలంలోని శాతనకోట, మల్యాల గ్రామాలకు చెందిన రైతులు హంద్రీనీవా పథకం వద్ద ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్థర్ అధికారులతో మాట్లాడి హంద్రీనీవా నుంచి ఒక మోటరు ద్వారా 335.6 క్యూసెక్కుల నీటిని కేసీ కాలువకు విడుదల చేయించారు. కేసీకి నీటిని విడుదల చేయించడంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దాసుపత్రికి సీఆర్మ్ మిషన్లు

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అత్యాధునిక సీఆర్మ్ మిషన్లను మంజూరు చేసింది. ఒక్కోటి రూ.19లక్షల విలువ చేసే ఈ మిషన్లను ఇప్పటికే ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, యురాలజి విభాగాల్లో ఏర్పాటు చేశారు. తాజాగా గ్యాస్ట్రో ఎంట్రాలజి విభా గానికి సైతం ఈ మిషన్ వచ్చింది. దీనిని శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ప్రారంభించారు.

మాట ఇచ్చారు.. ప్రాణం నిలిపారు

- యువకుడి శస్త్రచికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.33లక్షల సాయం



పత్తికొండ పర్యటనలో సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన బాధితులు (ఫైల్)



ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఈరన్న, అతని తల్లిదండ్రులు

మద్దికెర: మాట ఇచ్చారంటే..కచ్చితంగా చేస్తారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారు. యువకుడి శస్త్రచికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 33 లక్షలు మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం కుమారుడు క్షేమంగా ఇంటికి రావడంతో సీఎం పునర్జన్మ ప్రసాదించారని శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని కలిసి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మద్దికెర గ్రామానికి చెందిన పూజారి చిదానంద, ఈరక్క సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు ఈరన్న (24) కూడా అదే వృత్తిలో ఉంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఉన్నట్టుండి కడుపులో నొప్పి రావడంతో ఆసుపత్రిలో చూపించగా పేగు పాడైందని, మార్చాలని, ఇందుకు లక్షల రూపాయల ఖర్చు అవుతుందని డాక్టర్లు సూచించారు. పేదలు కావడంతో అంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియక అల్లాడిపోయారు. జూన్ 1 వతేదీన పత్తికొండలో జరిగిన రైతు భరోసా కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మద్దికెర జెడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య సహకారంతో సీఎంను కలిశారు. ఈరన్న ఆరోగ్య పరిస్థితి వివరించడంతో సీఎం వెంటనే జిల్లా కలెక్టర్, సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేశారు. ఆపరేషన్‌కు రూ.33 లక్షలు ఖర్చు అవుతుందని అదికారులు చెప్పడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో పేగు మార్పిడి ఆపరేషన్ పూర్తి చేసుకుని ఈరన్న ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారు.

25 టన్నుల టమాట కొనుగోలు

- టమాట రైతుకు ప్రభుత్వం భరోసా

కర్నూలు(అగ్రికల్చర్): టమాట రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కిలో ధర రూ.7 కంటే తక్కువకు పడిపోయినప్పుడు మార్కెటింగ్ శాఖ అధికారుల బృందం రంగంలోకి దిగి కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న చొరవతో టమాట రైతులకు ఊరట లభిస్తోంది. మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం శనివారం నాటికి ప్యాపిలిలో 25 టన్నుల టమాట కొనుగోలు చేయడం విశేషం. ఉమ్మడి జిల్లాలో ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, పత్తికొండ, ఆస్పరి, పెద్దకడుబూరు, మద్దికెర, దేవనకొండ, కల్లూరు, ఓర్వకల్, కర్నూలు తదితర మండలాల్లో టమాట సాగయింది. పంట మొత్తం ఒకేసారి మార్కెట్‌లోకి రావడం వల్ల ధరలు పడిపోయాయి. పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమాట కొనుగోళ్లు చేస్తున్నారు. ప్యాపిలిలో ప్రైవేటుగా టమాట మార్కెట్ నడుస్తోంది. పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ కాకుండా టమాట కొనుగోళ్లు చేస్తుండటంతో కిలో ధర రూ.7 నుంచి రూ.14 వరకు లభిస్తోంది. ప్యాపిలి మార్కెట్‌పై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో వ్యాపారులు ఇచ్చిందే ధరగా తయారైంది. అయితే కిలో ధర రూ.7 కంటే తక్కువకు పడిపోతుండటంతో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతు నష్టపోకుండా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి నగదు వెంటనే చెల్లిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన టమాటను కర్నూలు నగరంలోని మూడు రైతుబజార్లు, ఆదోని రైతుబజారుకు తరలించి వినియోగదారులకు నోలాస్, నో ప్రాఫిట్ కింద విక్రయిస్తున్నారు.

కర్నూలులో 56 అడుగుల మట్టి వినాయక విగ్రహం



భారీ మట్టి గణపతి విగ్రహం వద్ద ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరం తుంగ భద్రా నది తీరంలో ఏర్పాటు చేస్తున్న 56 అడుగుల మట్టి విగ్రహం దేశంలోనే పర్యావరణ పరిరక్షణలో మొదటి స్థానంలో ఉండి ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తుంగ భద్రా నది తీరంలో ఒకటో వార్డులో కల్యాణ్ మిత్ర బృందం ఏర్పాటు చేయనున్న 56 అడుగుల మట్టి వినాయ విగ్రహ తయారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలోనే పర్యావరణ వినాయకుడిని ప్రతిష్ఠ చేయడంలో కర్నూలు నగరం ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ వారి రికార్డును వారే తిరగ రాయడం అభినందనీయమన్నారు. ఈనెల 18వ తేదీ వినాయక చవితి నుంచి 11 రోజుల పాటు పూజలందుకొని ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షులు కల్యాణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘాట్‌లో అదుపు తప్పిన ట్యాంకర్

- కారు, బైక్ ఢీకొని లోయలోకి దూసుకెళ్లిన వైనం



మహానంది: తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ట్యాంకర్ శనివారం కూల్‌డ్రింక్స్ స్పిరిట్‌తో నంద్యాల వైపు వస్తుండగా నల్లమల ఘాట్‌లో రోడ్డులో పాత బొగద మలుపు వద్ద అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ముందుగా బొగద మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఓ కారును ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కనే నిలిపి ఉన్న బైకును ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లింది. బైకు సైతం లోయలో పడింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ నిడదవోలుకు చెందిన గోపిశెట్టి శేషయ్య స్వల్పంగా గాయపడ్డాడు. అలాగే తంబళ్లపల్లికి చెందిన కారు ఓనర్, డ్రైవర్ వలి ప్రాణాలతో బయటపడగా కారు దెబ్బతింది. యర్రగొండపాలెం గ్రామానికి చెందిన బాలవెంకటయ్య నంద్యాలకు వస్తూ నల్లమల అందాలను చూసేందుకు బైకును రోడ్డు పక్కన ఆపి వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దివ్యాంగుల వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): కర్నూలు నగరం సి.క్యాంప్‌లోని దివ్యాంగుల బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగ విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి 100 మంది వరకు వసతి కల్పిస్తామన్నారు. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల నుంచి దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ లోపు వసతిగృహ సంరక్షకునికి అందజేయాలన్నారు. వివరాలకు 08518-277864 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

8 వాహనాల సీజ్

కర్నూలు (న్యూసిటీ): అక్రమంగా గ్రావెల్, రోడ్డు మెటల్, క్వార్జ్ రాయిని తరలిస్తున్న ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ శనివారం విలేకరులకు తెలిపారు. బెంగళూరు, కడప హైవేల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల సమయంలో అధికారులు దాడులు నిర్వహించారన్నారు. నాలుగు వాహనాలలో గ్రావెల్, మూడు టిప్పర్లలో రోడ్డు మెటల్, ఒక టిప్పర్‌లో క్వార్జ్ రాయి అక్రమంగా తీసుకెళ్తున్నట్లు గుర్తించారన్నారు. నాలుగు వాహనాలను కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌కు, మిగిలిన వాటిని ఉలిందకొండ పోలీసుస్టేషన్‌కు తరలించామని చెప్పారు. వాహన యజమానులకు రూ.3 లక్షల జరిమానా విధించామని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, రోడ్డు మెటల్‌ను తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.